విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

రోడ్లు నిర్మించండి-జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర -భీమవరం: ప్రజా ప్రయోజనాలకు తొలి ప్రాధాన్యత నిస్తూ రహదారుల నిర్మాణాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి సంబంధిత శాఖల ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టర్ చాంబర్‌లో పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లాకు మంజూరైన రోడ్ల నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి పరిధిలో చేపట్టిన, చేపట్టాల్సిన రహదారులు, కల్వర్టులు నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని కొన్ని ప్రదేశాల్లో రోడ్లు పెద్ద మొత్తంలో మరమ్మతులకు గురయ్యాయని వాటి నిర్మాణాలకు తగుచర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాధాన్యత భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే నిర్మాణాలను పూర్తి చేసుకున్న మంచిలి, లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను హ్యాండ్ ఓవర్ చేసుకుని వినియోగంలోనికి తీసుకురావాలని డి ఎం అండ్ హెచ్ ఓ కు సూచించారు. ఆచంట, మేడపాడు పి.హెచ్.సిల ఫినిషింగ్ పనులను పూర్తి చేసి జిల్లా వైద్యశాఖకు అప్పగించాలన్నారు. జ్యూడిషియల్ క్వార్టర్స్ మరమ్మతుల పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా రహదారులు, భవనాలు శాఖ అధికారి బి.లోకేశ్వరరావు, డిఈ లు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సవరణ ప్రక్రియ

విశాలాంధ్ర- కాళ్ళ: ఓటర్ల సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, తొలగింపులు, చేర్పులు, మార్పులు జాబితాలు ఆయా సచివాలయాలలో డిస్ ప్లే చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం కాళ్ళ మండలం సీసలి, ఏలూరుపాడు గ్రామ సచివాలయాలను జిల్లా కలెక్టరు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. తొలగింపులు, మార్పులు, చేర్పులు జాబితాల రిజిస్టర్లను, కంప్యూటరు డేటాను పరిశీలించి అధికారులకు జిల్లా కలెక్టరు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ1500 ఓటర్లు కన్నా ఎక్కువ మంది ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్ పరిధిలో కొత్త పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితాల వారీగా పోలింగ్ కేంద్రాలు పునర్విభజన ప్రక్రియ అత్యంత పకడ్బందీగా చేయాలన్నారు. సెప్టెంబరు నెలాఖరు నాటికి పోలింగ్ కేంద్రాల పునర్వి భజన కార్యక్రమం పూర్తిచేయవలసి వుందన్నారు. దీనిలో భాగంగా పోలింగ్ కేంద్రాలకు సంబంధించి భవనాల మార్పుగానీ, పేరు మార్పుగానీ ఏమైనా ఉంటే ప్రతిపాదించవలసిన అవసరం ఉందన్నారు. జిల్లా కలెక్టరు వెంట తహశీల్దారు టీపి కృష్ణారావు, బియల్వోలు, సచివాలయం, రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సాంప్రదాయాలను పాటించడంతో విలువలను పరిరక్షించవచ్చు

- జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: రాఖీ కట్టడం ద్వారా శాంతి, సౌభ్రాతృత్వ సందేశాన్ని అందిస్తున్న బ్రహ్మకుమారీ సోదరీమణులు అభినందనీయులని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టర్ బంగ్లాలో రాఖీ పౌర్ణిమ, రక్షా బంధన్ కార్యక్రమం పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్‌కు ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు రాజయోగిని, బి.కె. లావణ్య, రాజయోగ టీచరు బి.కె. మమత రాఖీలు కట్టి శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా రక్షా బంధన్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలను పాటించడం ద్వారా విలువలను పరిరక్షించవచ్చన్నారు. బ్రహ్మకుమారీస్‌కు కలెక్టర్ సతీమణి డాక్టర్ మానస కూడా రాఖీ పౌర్ణిమ, రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ మాజీ ఉద్యోగి బి.కె. నరసింహారావు, వ్యాపార వేత్త బి.కె. ఎస్. ఎన్ పాత్రుడు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

విశాలాంధ్ర -తణుకు : సోదరులు, సోదరిమణుల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్(రాఖీ) సందడి గతంలో కంటే అధికంగా కనిపిం చింది. రక్షాబంధన్ కార్యక్రమాలు పలుచోట్ల ఇంటింటా నిర్వహిం చారు. రక్షాబంధన్ విశిష్టతను చాటుతూ నీకు నేను రక్ష.. నాకు నీవు రక్ష అంటూ సోదరులు, సోదరీమణులు పరస్పరం భావించుకుంటూ రాఖీలను కట్టుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యంగా సాంప్రదాయాలకు అనువుగా తలస్నానాలు చేసి పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు జరిపిన మీదట అన్నదమ్ములకు నుదుట తిలకం దిద్ది రాఖీలు కట్టి ఆశీర్వచనాలు పొందారు. తణుకు మాజీ ఏఎంసి చైర్మన్ చిట్టూరి సునంద, రాష్ట్ర పౌర సరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

రాఖీ వేడుక

విశాలాంధ్ర-లింగపాలెం : అన్నా చెల్లెళ్ళ, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి రాఖీ పండుగ ప్రతీక అంటూ ధర్మాజీగూడెంలోని శ్రీ విద్యా పాఠశాలలోని విద్యార్థులు తమ అనురాగాన్ని చూపించారు. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయతలు తెలుపుతూ ఆత్మీయ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టారు. రాఖీ పండుగ పవిత్రమైనదని, అనురాగాలకు,ఆప్యాయతలకు ప్రతీకగా ఉన్న ఈ పండుగను పవిత్రంగా జరుపుకోవాలని పాఠశాల డైరెక్టర్ చలసాని రత్నాకర్,ప్రిన్సిపాల్ సునంద తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయానికి కంప్యూటర్ల బహూకరణ

విశాలాంధ్ర - పెనుమంట్ర: మండల కేంద్రమైన పెనుమంట్ర గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయానికి వెలగల వారి పాలెం గ్రామస్తుడు తాడి రాజారెడ్డి సుమారు రూ.50వేల విలువచేసే రెండు కంప్యూటర్లు, ఒక ప్రింటర్ ను గురువారం అందజేశారు. తహసీల్దార్ కార్యాలయానికి ప్రభుత్వం ఇచ్చినవి పాతవి సరిగ్గా (వేగంగా)పనిచేయకపోవడంతో కంప్యూటర్లను, ప్రింటర్లను అందజేసినట్లు దాత తాడి రాజారెడ్డి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని తహసీల్దారు అశోక్ వర్మ అన్నారు. తహసీల్దారు దాత రాజారెడ్డికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేసారు.

యుద్ధప్రాతిపదికన నాడు-నేడు పనులు

జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో నాడు-నేడు కింద పాఠశాలల్లో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఎపివిద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల సంస్థ, పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మునిసిపల్ కార్పోరేషన్, పబ్లిక్ హెల్త్, తదితర అధికారులతో మనబడి నాడు-నేడు రెండవ దశ పనుల పురోగతిపై జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పనుల పురోగతికి సంబంధించి పెండింగ్ పనులపై జెసి ఆరా తీశారు. ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలు, ఇప్పటి వరకు ప్రారంభించని పనులు, బడ్జెట్, యం బుక్ నమోదు తదితర అంశాలపై జెసి సమీక్ష చేశారు. అధికారులు రోజువారీ మోనటరింగ్ చేసి పనుల పురోగతి పై సమీక్ష నిర్వహించి సంబంధిత అధికారులు సమన్వయంతో పనుల ప్రగతిని వేగవంతం చేయవలసిన అవసరం ఉందని అధికారులను ఆదేశించారు. పనులు యుద్ధప్రాతి పదికన చేపట్టి వచ్చే మాసంనాటికి పూర్తిచేయా లని దీనికి సంబంధించిన ప్రణాళికను రూపొం దించి వచ్చే సమావేశంలో సమర్పించాలని జెసి ఆదేశించారు.ఈ సమావేశంలో డిఇఓ శ్యామ్ సుందర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలల సమగ్రాభివృద్ధికి బాలల హక్కుల చట్టం అత్యంత ప్రాధాన్యత

విశాలాంధ్ర- ఏలూరు : సమాజంలో బాలలందరూ సమగ్ర అభివృద్ధితో జీవనం సాగించ డానికి బాలల హక్కుల చట్టం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. రాజేశ్వరి తెలిపారు. గురవారం ఏలూరు కోర్టు ఆవరణలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థ భవనంలో బాలల హక్కులు, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయమూర్తి పి. పురుషోత్తమ కుమార్ ఆదేశాలు మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు న్యాయ సేవల శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సదస్సులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. రాజేశ్వరి మాట్లాడుతూ బాలల హక్కుల తీర్మానంలో జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, పాల్గొనే హక్కు ప్రధాన మైనవని తెలిపారు. జీవించే హక్కుద్వారా మన ఎదుగుదలకు కావల్సిన సంపూర్ణ ఆహారాన్ని పొందడం, మంచి వాతావరణం, కుటుంబ, వైద్య సదుపాయాలు, మొదలగు ప్రాథమిక అవసరాలు పొందడం, రక్షణ పొందే హక్కు కింద కుల, మత, లింగ, వివక్షలు, నిర్లక్ష్యం, దౌర్జన్యం, హింసా త్మక చర్యలనుండి కాపాడబడటం, ప్రకృతివైపరీత్యాల నుండి రక్షించడం తదితర హక్కుల గురించి, అభివృద్ధి చెందే హక్కు కింద బాలల స్వయం సమృద్ధి కలిగి శాంతి సామరస్యాలతో తదితర అంశాలను, తదితర రక్షణ ఎప్పుడూ తోడుగా ఉండాలంటే తల్లిదండ్రులు, పెద్దలు బాల్యదశ నుంచే అవకాశాలు అందజేయాలని తెలిపారు. డిఆర్‌ఓ ఎవిఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ బాల్యం నుంచే బాలలకు అందజేయవలసిన హక్కులపై అవగాహన చేసుకొని తల్లిదండ్రులు వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపివో సూర్యచక్రవేణి, సీనియర్ న్యాయవాది పి. కృష్ణారావు, రామ్మోహన్‌రావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విభిన్న ప్రతిభావంతుల అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర్ బాలల హక్కులపై ప్రసంగించారు. ఈ కార్యక్రమ అనంతరం న్యాయశాఖ సేవలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. రాజేశ్వరి ప్రారంభించారు. అనంతరం న్యాయసేవాధికార సంస్థ స్టాల్స్‌ను బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అబ్బినేని విజయకుమార్, డిఆర్‌ఓ ఎవిఎస్ఎస్ మూర్తితో కలిసి ఆమె తిలకించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట డైరెక్టర్ కుముదిన్ సింధూ, యంఇఓ నరసింహమూర్తి, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా విఘ్నేష్, శ్రీనివాస్

విశాలాంధ్ర - ఏలూరు : ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్షులుగా కూనపాముల విఘ్నేశ్వరరావు, కార్యదర్శిగా భజంత్రి శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా తోర్లపాటి బాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నూతన అధ్యక్ష, కార్యదర్శులు విఘ్నేష్, శ్రీనివాస్ బుధవారం విలేఖరులకు వివరాలు వెల్లడించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ గురువారం స్థానిక సిపిఐ ఏలూరు జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు విఘ్నేష్, శ్రీనివాస్ తెలిపారు. కోశాధికారిగా ముత్యాల నాగేంద్రరావు, ఉపాధ్యక్షులుగా దొడ్డిగర్ల నాగబాబు, సహాయ కార్యదర్శిగా బొక్కా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులుగా శ్రీరామ్ వెంకటయ్య, వెలగాడి అనురాధ, బొత్స రాజేష్, ముప్పిడి సురేష్, కొత్తూరి శ్రీను, కొత్తూరి నాగేశ్వరరావు, చెన్న చంద్రావతి,ఎలగాడ శివకుమార్, బంగారు దుర్గాప్రసాద్, సిహెచ్. నాగేశ్వరరావు, ధనియాల రవీంద్ర, సింగంపల్లి అరుణలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆహ్వానితులుగా మడుగుల జగదీష్ పాడుదోలు రమణ, పడిత్య బాలులను ఎన్నుకున్నారని తెలి పారు. ఈ మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించినట్లు ప్రకటించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను క్రమ బద్దీకరిం చాలని. పెరిగిన జనాభాకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తీర్మానించారు. ఆప్కాస్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు రిటైర్డ్ అయినా, విధి నిర్వహణలో మరణించిన వారి స్థానాలను తక్షణమే భర్తీ చేయాలని తీర్మానించారు. కార్మికులపై పని భారం తగ్గించాలని, కరోనా సమయంలో చనిపోయిన కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించి అమలు చేయాలని, క్యాప్ ఆటో డ్రైవర్లకు కాంట్రాక్ట్ కాకుండా రెగ్యులర్‌గా గుర్తించాలని పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ప్రభుత్వమే ఇళ్లునిర్మించి ఇవ్వాలని తీర్మానించినట్లు తెలిపారు.

విధుల నుంచి వలంటీర్ తొలగింపు

విశాలాంధ్ర -చింతలపూడి : చింతలపూడి మండలంలోని రాఘవాపురం గ్రామ సచివాలయం (సచివాలయంకోడ్-10590818) లో వలంటీర్ గా పనిచేస్తున్న కోటమర్తి రవి కుమార్, క్లస్టర్ నెంబర్-16 వివాహితను లైంగికంగా వేధించినందుకు , అత్యాచార ఆరోపణల వార్త పై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరిపి సంబంధిత వాలంటీర్ పై చర్యలు తీసుకోవలసినదిగా ఆదేశించినట్టు చింతలపూడి మండల పరిషత్ అభివృద్ధి అధికారి మురళి కృష్ణ తెలియజేశారు. అత్యాచార ఆరోపణలు, లైంగికంగా వేధింపుల పై వాలంటీర్ పై వచ్చిన వార్తపై చింతలపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కోటమర్తి రవికుమార్‌ను విధులనుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ప్రతిమలు నిషేధం

విశాలాంధ్ర - భీమవరం: ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారుచేసిన వినాయక ప్రతిమలు పూర్తిగా నిషిద్ధం, విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.గురువారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక చతుర్థి జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పర్యావరణ వినాయక చతుర్థి జరుపుకునేందుకు ముందస్తు చర్యలు, అవగాహన పై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు లోబడి విగ్రహాల తయారీ, నిమజ్జనం కార్యక్రమాలు ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు తయారీ, అమ్మకాలు నిషేధం అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా తయారు చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.100 విగ్రహాలు పైబడి తయారు చేసేవారు కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేసుకుని, ట్రేడ్ లైసెన్స్ పొందాలన్నారు. పోలీస్ శాఖ నుండి సౌండ్ సిస్టం పర్మిషన్ తప్పనిసరి అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. వెంకటేశ్వరరావు, డిపిఓ జీవీకే మల్లికార్జునరావు, డీఈవో ఆర్. వెంకటరమణ, వివిధ పరిశ్రమలు ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

జీవో 107, 108 లను రద్దు చేయాలి-ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర -భీమవరం: పేద మెరిట్ విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు తీసుకువచ్చిన జీఓ నెంబర్ 107, 108 లను రద్దు చేయాలని. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు సి హెచ్ సుందర్, టీ.అప్పల స్వామి డిమాండ్ చేశారు. గురువారం డి యన్ ఆర్ కళాశాల కూడలిలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 107,108 జీఓలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టి .అప్పలస్వామి , సి హెచ్ సుందర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వ వైద్య కళాశాలలో 50 శాతం ఎంబీబీఎస్ సీట్లను కన్వీనర్ కోటాలో కేటాయించి మరో 50 శాతం ఎంబీబీఎస్ సీట్లను బిసి కేటగిరీలుగా విభజించి లక్షల రూపాయలకు అమ్ముతూ ఈ ప్రభుత్వం వైద్య విద్యను పూర్తి స్థాయిలో వ్యాపారం చేసిందని విమర్శించారు. దీంతో ఎస్ టి ,ఎస్ సి ,బి సి , మైనారిటీ విద్యార్థులకు రిజర్వేషన్ ప్రాతిపదికన కేటాయించే వైద్య సీట్లు తగ్గే ప్రమాదముందని ఆపై ఈ వర్గాల విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. 100 శాతం సీట్లను కన్వీనర్ కోటాలోనే భర్తీ చేయాలని వైద్య విద్యను వ్యాపారం చేయడం కోసం తీసుకువచ్చిన జీఓ నెంబర్ 107 ,108 లను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కారుమంచి మనోజ్, పి పవన్ ,కె.అంజి, వి.పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి

విశాలాంధ్ర -భీమవరం: పుట్టిన, పెరిగిన గ్రామానికి సియస్ఆర్ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేసి ప్రజల మన్నలను పొందాలని జిల్లా కలెక్టరు పి ప్రశాంతి అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేటు స్పందన సమావేశ మందిరంలో సియస్ఆర్ (కార్పొరేటు సోషల్ రెస్పాన్స్) నిధులు వినియోగం పై పారిశ్రామిక, ఆక్వా వేత్తలు, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లా డుతూ గత సంవత్సరం సియస్ఆర్ నిధులు ఆశించినంతగా పనులు జరగలేదన్నారు. నూతన జిల్లాగా రెండవ సంవత్సరం అడుగు పెట్టామని , ఈ సంవత్సరంలో పారిశ్రామిక, ఆక్వా వేత్తలు ఉత్సాహంగా ముందుకు రావాలన్నారు. ఆదాయంలో 2 శాతం సియస్ఆర్ కింద అభివృద్ధి కార్యక్రమాలు తప్పనిసరిగా చేయాలన్నారు. గేల్స్ అథారిటీ వారికి ఈ సంవత్సరం 1 కోటి 30 లక్షలు సీఎస్ఆర్ కింద పనులు చేపట్టాలని ప్రదిపాదనలు పంపించామన్నారు. ఆంధ్రా షుగర్స్ వారు 10 లక్షలు, వాన్ భేరీ కంపెనీ వారు 1 లక్ష సిఎస్ఆర్ క్రింద డిపాజిట్ చేయట జరిగిందన్నారు. ఓఎన్జిసి వారికి 70 లక్షల రూపాయలు, వసుధ ఫౌండేషన్ స్కూల్ అభివృద్ధికి చేయుటకు 60 లక్షలు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని ఈ సందర్భంగా ఆమె అన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యానికి మొదట ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఉయ్యాల ఆదిశేషు, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ టీ త్రినాధరావు, పొల్యూ షన్ బోర్డ్ ఇఇ కె. వెంకటేశ్వరరావు, సిపివో కె. శ్రీనివాస రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి మహేశ్వర రావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. వెంకటరమణ, లేబర్ కమిషనరు ఏ లక్ష్మి , పురపాలక సంఘం కమిషనర్ యం. శ్యామల, పారిశ్రామిక, ఆక్వా పారిశ్రామిక వేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకపత్రాల పంపిణీ

విశాలాంధ్ర-ఏలూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగ కుటుంబ సభ్యులకు గురువారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి కారుణ్య నియామకం కింద 5గురికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఖాళీల సంఖ్య, రోస్టర్, సీనియారిటీ ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి తెలిపారు. ఈ 5 గురిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2 కింద పులపర్తి బ్యూలా అనూషకు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లుగా చవటపల్లి వెంకటేశ్వరరావుకు, పాలవలసల దుర్గాప్రసాద్ లకు, డిజిటల్ అసిస్టెంట్లుగా కడిమి హర్షాదీప్ కు, యడ్ల విమల కు నియామక పత్రాలను జెసి అందజేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ విధులలో అలసత్వం వహించకుండా క్రమ శిక్షణతో విధులను నిర్వహించి తమ కుటుంబాలకు ఆర్థికంగా,అండగా ఉండాలని కోరుతూ వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ ఎవిఎస్ఎస్ మూర్తి, కలెక్టరేట్ ఏవో రమాదేవి, సెక్షన్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

జగన్ దిష్టిబొమ్మ దగ్ధం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జీ ఆధ్వర్యంలో బ్రహ్మానంద మార్కెట్ లోని విజయటాకీస్ వద్ద ముఖ్యమంత్రి జగన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. గురువారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో లోకేష్ ప్రారంభించిన యువగళం పాదయాత్ర ప్రారంభించి 200 రోజులు పూర్తయిన సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వలవల బాబ్జీ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెంలో కొంత మంది వైసిపి నాయకులు లోకేష్ దిష్టిబొమ్మను గాడిదపై ఊరేగించినందుకు నిరసనగా ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేసామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, ముత్యాల సత్యనారా యణ, ముప్పిడి రమేష్, పట్నాల రాంపండు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోదరభావానికి ప్రతీక రక్షా బంధన్

- కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర - ఏలూరు : రాఖీ పౌర్ణిమ, రక్షబంధన్ అనుబంధాలను పెంపుచేస్తూ బాధ్యతలను గుర్తుచేసే వేదికని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు.రాఖీ పౌర్ణమి, రక్షా బంధన్ పురస్కరించుకొని గురువారం స్థానిక కలెక్టర్ బంగ్లాలో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ కు జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ,రాఖీ కట్టారు. తొలుత జెడ్పి చైర్ పర్సన్ దంపతులు ఘంటా పద్మశ్రీ, ఘంటా ప్రసాద్ జిల్లా కలెక్టర్ బంగ్లాకు రాగా వారికి కలెక్టర్ దంపతులు వె. ప్రసన్న వెంకటేష్, డాక్టర్ మానస ఆప్యాయతగా స్వాగతం పలికి రక్షబంధన్ శుభాభినందనలు తెలిపారు. రక్షా బంధన్ సందర్భంగా రాఖీ కట్టిన జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీకి కలెక్టర్ దంపతులు నూతన వస్త్రాలు బహూకరించారు. సోదరీ, సోదరుల అనుబంధానికి రాఖీ పండుగ ప్రతీక అని జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు.

కలెక్టర్‌కు రాఖీలు కట్టిన చిన్నారులు

పిల్లలతో ఆప్యాయంగా ముచ్చటించిన కలెక్టర్

విశాలాంధ్ర-పెదపాడు: పెదపాడు మండలం అప్పనవీడుకు చెందిన ఆశా జ్యోతి విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమ సొసైటీ ఆధ్వర్యంలో రక్షా బంధన్ పురస్కరించుకొని స్థానిక కలెక్టర్ బంగ్లాలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు పలువురు చిన్నారులు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ సతీమణి డాక్టర్ మానస, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో కలిసి కాసేపు పిల్లలతో ఆప్యాయతగా ముచ్చటించారు. బాగా చదువుకుంటున్నారా, వసతులు సక్రమంగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు చాక్లెట్లను, మిఠాయిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశాజ్యోతి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సొసైటీ డైరెక్టర్ యం. మాధవీలత, ఇతర సిబ్బంది, పలువురు విభిన్న ప్రతిభావంతులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఫ్రైమ్ 2.0 విధానం తక్షణమే ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర -ఉండి : ఫ్రైమ్ 2.0 విధానంతో రాష్ట్రంలో ఉన్న లక్షలాదిమంది లేఖర్లు డిటిపి ఆపరేటర్లు స్టాంప్ వెండర్లు రోడ్డున పడతారని ప్రభుత్వం ఈ విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఉండి మండలం దస్తావేజు లేఖర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ సందర్భంగా ఉండి సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గవర్నమెంట్ రిజిస్ట్రేషన్ శాఖ వారు దస్తా లేకర్ల ప్రమేయం లేకుండా కక్షిదారులే రిజిస్టర్ కార్యాలయానికి వెళ్లి సిబ్బందితో కలిసి దస్తావేజు రాసుకునే ప్రక్రియ ఫ్రైమ్ 2.0 అనే విధానం తీసుకురావడం బాధాకరమని దీనివలన లక్షలాదిమంది రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముసుకోలు సింహాచలం, కొమ్మన రాఘవయ్య, బురిడి రవిబాబు, సందుల నారాయణమూర్తి, బురిడి వీర్రాజు, మెట్టా సత్యనారాయణ ,లోకవరపు రాము, కలిగొట్ల పాండురంగ శ్రీనివాస్, కంప్యూటర్ ఆపరేటర్లు, స్టాంప్ వెండర్లు తదితరులు పాల్గొన్నారు.

బీమా చేద్దాం-ధీమాగా ఉందాం

విశాలాంధ్ర-మండవల్లి: బీమా పథకాలు విపత్తు సమయంలో కుటుంబానికి ఆర్థిక భరోసానిస్తాయని మండవల్లి ఇండియన్ బ్యాంక్ శాఖ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. గురువారం బ్యాంక్‌లో మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్షబీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాలలో చేరిన 16 కుటుంబాల వారికి ఆరునెలల కాలవ్యవధిలో రూ.34 లక్షల బీమా పరిహారం అందించామని మరో 8 లక్షలు మంజూరు కావాల్సి ఉందన్నారు. తక్కువ ప్రీమియంతో కొండంత రక్షణ ఉంటుందని బీమా పథకాలపై ప్రజలను చైతన్యం చేస్తున్నామని బ్యాంకు ద్వారా అందించే సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. ఖాతాదారులకు సత్వర సేవలు అందిస్తున్నా మని గ్రామీణ ప్రాంతాల వారికి బ్యాంకు సేవలు అందేలాగా చర్యలు తీసుకున్నా మని వివరించారు.

బడి బయట విద్యార్థుల చేరికకు చర్యలు

విశాలాంధ్ర-మండవల్లి: చదువు ఆపివేసి బడి ,కాలేజీ బయట ఉన్న విద్యార్థులను తిరిగి చేర్పించ టానికి ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టరు ఆదేశాలతో డ్రాపవుట్స్‌ను గుర్తించి వారిని తిరిగి పాఠశాల, కాలేజీలలో చేర్పించేందుకు మిషన్‌గ్రాస్ ఎన్‌రోల్ మెంట్ కార్యక్రమం దోహదం చేస్తుందని మండవల్లి జూనియర్ కళాశాల ప్రిన్సి పాల్ గుడివాడ సుధాకర్ అన్నారు. మండవల్లి, అయ్యవారిరుద్రవరం, అప్పాపురం, గన్నవరం, పెరికెగూడెం గ్రామాల్లో పర్యటించి చదువు మానివేసిన విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వివరించటమే కాకుండా విద్య ప్రాముఖ్యతను వివరిస్తున్నామని సుధాకర్ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు సానుకూ లంగా స్పందిస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడిన వారిలో అధ్యాపకులు రమేష్,ప్రభయ్య, శివకుమారి, మైనర్‌బాబు, కిరణ్ కుమారు బాబా, సుబ్రహ్మణ్యం, దివాకర్ పాల్గొన్నారు.

గురజలో ఎస్టీలకు కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-ముదినేపల్లి: సుమారు 60-70 సంవత్సరాలుగా స్థిరపడిన ఎస్టీలకు కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంపై వారు టిడిపి నియోజకవర్గ నాయకులు కొడాలి వినోద్‌ను కలిసి తమకు మద్దతుగా నిలవాలని కోరారు. ముదినేపల్లి మండలం గురజ అల్లూరి సీతారామరాజు ఎస్టి కాలనీకి చెందిన ఎస్టీలు విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల నుండి ఇక్కడికి వలస వచ్చి సుమారు 70 సంవత్సరాలైంది. కాలనీకి చెందిన ఎస్టి వ్యక్తి సర్పంచిగా పనిచేశారు. ప్రస్తుతం సర్పంచ్ ఎస్టీనే ఇక్కడ నివసిస్తున్న కాలనీవాసులకు కొందరికి మాత్రమే ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు ఇచ్చి రెవిన్యూ అధికారులు మిగతా వారికి ముఖ్యంగా విద్యార్థులకు ఇవ్వకపోవ డంతో వారు నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారని ప్రభుత్వ రాయితీలకు, రిజర్వేషన్లకు దూరం అవుతున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ప్రత్యేక కమిటీని వేశారు. ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. దీనిపై రెవెన్యూ కార్యాలయం వద్ద టీడీపీ తరఫున సమస్య పరిష్కారానికి పోరాటం చేస్తానని వినోద్ తెలిపారు.

వేళాపాళా లేని కరెంటు కోతలు

సతమతమవుతున్న జనం

విశాలాంధ్ర-మండవల్లి: ఆగస్టు నెలలోను మండుటెండలతో జనం అల్లాడుతుండగా వేళాపాళా లేని కరెంటు కోతలతో సామాన్య జనం తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గత కొద్ది నెలలుగా విద్యుత్ బిల్లులు వినియోగదారులను కలవరపాటుకు గురిచేస్తుండగా విద్యుత్‌కోతలు తీవ్ర ఇక్కట్లు పాలు చేస్తున్నాయి. పగలు,రాత్రి అనే తేడా లేకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుండటం, దోమల బెడదతో కంటి మీద కునుకు లేకుండా కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితులు దాపురించాయి. గ్రామాల్లోను, మండల కేంద్రాల్లోను ఇష్టారాజ్యంగా కరెంటు కోతలతో వృద్ధులు.చిన్నారులు తీవ్ర ఇక్కట్ల పాలు అవుతుండగా కరెంటు ఎప్పుడు ఉంటుందో తెలియక జనం అగచాట్లు పడుతున్నారు. విద్యుత్ సక్రమంగా అందివ్వలేకున్నా బిల్లులు మాత్రం కన్నీళ్లు రప్పిస్తున్నాయని అదనపు చార్జీల మోతతో జేబులు గుల్ల అవుతున్నాయని పలువురు వాపోతున్నారు. విద్యుత్ కోతల సమయాన్ని ముందుగానే తెలియచేస్తే కనీసం ఇంటిపనులను సకాలంలో పూర్తి చేసుకుంటామని మహిళలు వ్యాఖ్యానిస్తున్నారు. చరవాణీలకు సైతం చార్జింగులు పెట్ట లేకపోతున్నామని,దుకాణాల్లోకి వినియోగదారులు వచ్చే సమయంలో కరెంటు లేకపోవటంతో వ్యాపారాలు తగ్గుతున్నాయని వ్యాపార వర్గాలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పొలం పనులు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చే రైతులకు కరెంటు కష్టాలతో నిద్ర లేమితో కొట్టుమిట్టాడుతున్నారు.

రొయ్యల చెరువులో ఎలుకల మందు కలిపిన దుండగులు

విశాలాంధ్ర- భీమడోలు : సాయం పాలెం గ్రామ శివారు ఏడెకరాల రొయ్యల చెరువు లో గుర్తు తెలియని వ్యక్తులు రొయ్యల చెరువులో ఎలుకల మందు కలపడంతో రొయ్యలు మృత్యువాత పడ్డాయి. గమనించిన రైతు భీమడోలు ఎస్ఐ చావా సురేష్‌కు ఫిర్యాదు చేయగా ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని అక్కడ జరిగిన విషయాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి నిధితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

లోకేష్ యువగళంలో అల్లర్లు సృష్టించి రాజకీయ లబ్ది

విశాలాంధ్ర -జీలుగుమిల్లి : వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర చేసి ముఖ్యమంత్రి అయ్యారని, నారా లోకేష్ యువ గళం చేస్తున్నాడని పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు జరుగుతుందని పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు అన్నారు. గురువారం గడపగడప కార్యక్రమంలో నిర్వాసిత గ్రామాలైన సిరివాక, టేకూరు, చీడూరు ,గాజులు గొంది ,కొరుటూరు గ్రామాలలో పర్యటించారు. నిర్వాసిత గ్రామాలలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పించి ఆ గ్రామాలలో భూ వివాదం లేకుండా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు. స్థానిక శాసనసభ్యులపై నిందలు, అసత్యాలు చేయడం సరి కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఎం. సూర్య తేజ్, తహసీల్దార్ జి. సుందర్ సింగ్, పోలవరం తహసీల్దార్ సుమలత, ఎంపీడీవో జి. శ్రీను, జీలుగుమిల్లి ఎంపీడీవో కెవిఆర్ కృష్ణ ప్రసాద్, పి ఆర్ డి ఈ శ్రీనివాసులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన మహంకాళి అమ్మవారి జాతర మహోత్సవ సంబరాలు

విశాలాంధ్ర-ఉండి : ఉండి మండలం ఎన్ఆర్‌పి అగ్రహారం బీసీ కాలనీలో శ్రావణమాస మహంకాళి అమ్మవారి జాతర మహోత్సవం డప్పులు తీన్మార్ గరగలు బుట్ట బొమ్మలు బాణసంచా తో అశేష భక్త జన సంతోషం నడుమ ఆ గ్రామ కమిటీ సభ్యులు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బీసీ కాలనీ నుండి రాజ వీధుల గుండా ముత్తయిదవులు కలసలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం మరాతాలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు మాజీ సర్పంచ్ మునుకోలు సింహాచలం, గలవల్లి ధనుంజయ సంఘ పెద్దలు మాట్లాడుతూ. ప్రతి సంవత్సరం శ్రావణమాస ఆఖరి గురువారం నాడు అమ్మవారికి గ్రామం తరపు నుండి మురాటలు నైవేద్యం సమర్పించుకుంటామని వారు తెలిపారు. కులమతాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా గ్రామమంతా ఐక్యంగా ఈ పండగ జరుపుకుంటామని వారన్నారు. ఈ పండగ గ్రామం అంతా ఐక్యంగా చేయడం వలన అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలవడం జరుగుతుందని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ యువగళంతో వణుకుతున్న వైసీపీ

విశాలాంధ్ర-వీరవాసరం: జగన్ అసమర్ధ ముఖ్యమంత్రిగా వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తున్న యువగళం పాదయాత్రతో వైసీపీ నాయకులలో వణుకు మొదలైందని టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి అన్నారు. తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా భీమవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ, వీరవాసరం మండల పార్టీ ఆధ్వర్యంలో యువగళం సంఘీభావ యాత్రను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని నందమూరిగరువు ఆంజనేయ స్వామి గుడివద్ద నుండి వీరవాసరం సెంటర్ వరకు సంఘీభావ పాదయాత్ర నిర్వహించిన అనంతరం టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ తెదేపా యువనేత నారా లోకేష్ 200 రోజులుగా నిర్వహిస్తున్న పాదయాత్ర విజయవంతంగా సాగడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ సెప్టెంబర్ 2న కాకినాడలో టిడిపి అధినేత చంద్రబాబు నిర్వహిస్తున్న జోన్-2 క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్ ల సమావేశానికి క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్ లు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. జిల్లా పార్టీ అధికార ప్రతినిధి వీరవల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ టిడిపి నాయకురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో సంఘీభావ యాత్ర నిర్వహిస్తున్నామని నారా లోకేష్ యువగళం పాదయాత్ర త్వరలో ఉండి నియోజకవర్గంలోకి ప్రవేశించి భీమవరం నియోజక వర్గానికి రానున్నట్లు తెలిపారు. వీరవాసరం మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్ లు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ శారీరిక శ్రమను అలసటను లెక్కచేయకుండా ఉత్సాహంగా స్థానిక ప్రజలతో కలిసి నడుస్తున్న తీరును ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపల్లి వెంకట్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆడిదల చిరంజీవి, వీరవాసరం మండల పార్టీ ఉపాధ్యక్షుడు యరకరాజు గోపాలకృష్ణార్జున రాజు, భీమవరం పట్టణ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, భీమవరం మండల ప్రధాన కార్యదర్శి కౌరు పృథ్వీశంకర్, ఐటీడీపీ అధ్యక్షులు కడలి వాసు, బొడ్డు మోహన్, మరపట్ల శ్యాంబాబు, నాయకులు రొంగల కృష్ణవేణి, మైలబత్తుల ఐసాక్ బాబు, గంట త్రిమూర్తులు, మద్దుల రాము, చల్లబోయిన సుబ్బారావు, పాలా శ్రీరామదాసు, చెల్లబోయిన గోవింద్, మల్లువలస రాము, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

విశాలాంధ్ర- వీరవాసరం: ద్విచక్ర వాహనదారు లందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ పి.రమేష్ తెలిపారు. వీరవాసరం పాలకొల్లు రోడ్డుపై స్థానిక డివైన్ మెర్సీ స్కూల్ వద్ద గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వాహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రత చర్యలలో భాగంగా హెల్మెట్ ధారణపై విస్తృత అవగాహన కలిగిస్తున్నామన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తలకు హెల్మెట్ ధరించకపోవడం వలన రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయాలు కావడంతో మృతి చెందుతున్నారన్నారు. రహదారి ప్రమాదాలలో హెల్మెట్ ధారణ వల్ల మరణాలు తగ్గించవచ్చన్నారు. కావున ద్విచక్ర వాహనం నడిపే సమయంలో హెల్మెట్ లేకపోవడం కారణంగా జరిగే అనర్ధాలపై ప్రజలకు అవగాహన కలిగించడం జరిగిందని ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ను తప్పనిసరిగా ధరించాలని కోరామన్నారు. కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైయస్సార్ కంటి వెలుగు ప్రోగ్రాం ద్వారా ఉచితంగా అవసరమైన వారికి కళ్ళకు శస్త్ర చికిత్సలు చేయించనున్నామని జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ వి పద్మ కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు బి రాంబాబు నాయక్‌లు అన్నారు. మండల కేంద్రం కిర్లంపూడిలో కాకినాడ శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో వారిరువురూ వైద్యులు పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. స్థానిక సత్యదేవ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కిరణ్ కంటి ఆసుపత్రి సీఈవో దేవరపల్లి జాన్, ఉదయ కుమార్ తమ సిబ్బంది వచ్చి ముందుగా కిర్లంపూడి మండలం నలమూలల నుండి దృష్టిలోపంతో చేరుకున్న వారందరికీ శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి సిబ్బంది స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. 105 మందికి నిర్వహించగా శస్త్ర చికిత్సలకు అవసరం ఉన్న వారిని 53 మందిని గుర్తించారు. ఈ కార్యక్రమంలో వైసిపి

నాయకులు పెంటకోట నాగబాబు వైస్ ఎంపీపీ బొద్దేటి గణపతి, కిర్లంపూడి పిహెచ్‌సి మహిళా వైద్యురాలు టి సాయి హేమాంజలి, విశ్రాంత ఉద్యోగి పెంటకోట మూర్తి, ఎటి రామప్రకాశ్, నైధాన రఘు, దాడి పెదబుజ్జి, దాడి అప్పలరాజు, మళ్ల నాగబాబు, వేగి సాంబశివ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పద్ధతి మార్చుకోకపోతే ప్రజలే బుద్ధిచెబుతారు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : టీడీపీ నాయకుడు లోకేష్ చిత్రపటాన్ని ఎమ్మెల్యే ఎలిజా ఆధ్వర్యంలో గాడిద పై ఊరేగించడాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక గంగానమ్మ గుడి వద్ద లోకేష్ బాబు చిత్రపటాన్ని గాడిదపై ఊరేగించిన స్థలంలో పసుపు నీళ్ళు, పాలతో శుభ్రం చేశారు. పోలీసులు ఈ కార్యక్రమానికి అనుమతి లేదని టిడిపి శ్రేణులను అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు టిడిపి నాయకులకు కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషును పోలీసులు అరెస్ట్ చేశారు. టిడిపి నాయకులు ఈ అరెస్టును అడ్డుకున్నారు. బలవంతంగా పోలీస్ జీపులో ఎక్కించుకొని స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, చింతలపూడి మాజీ శాసనసభ్యులు ఘంటా మురళి మీడియా తో మాట్లాడుతూ వైసీపీ నాయకుల అక్రమాలకు అదుపులేకుండా పోతున్నదన్నారు. చేసిన విమర్శలను ధైర్యంగా ఎదుర్కోవాలి గాని ఇలా హేయమైన కార్యాలకు దిగడం సరికాదన్నారు.లోకేష్ యువగళం విజయవంతంగా జరగడాన్ని ఓర్చుకోలేక వైసీపీ నాయకులు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఇకనైనా పద్ధతి మార్చుకోకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాయకుదురు హైస్కూల్ విద్యార్థినుల ప్రతిభ

విశాలాంధ్ర-వీరవాసరం: ఉత్తమ ప్రతిభతోనే విద్యార్థులకు గుర్తింపు లభిస్తుందని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్ర, జిల్లా స్థాయిలలో వివిధ పోటీలలో ప్రతిభ కనబరచి అవార్డులు పొందిన విద్యార్థినులకు గురువారం బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిసెఫ్, ఎస్సిఇఆర్టి ఆధ్వర్యంలో విజయవాడలో గత నెల 28,29,30 తేదీలలో రాష్ట్ర స్థాయిలో జరిగిన స్కూల్ ఇన్నోవేటివ్ ప్రోగ్రాం (ఎస్టిపి)కు ఎంపికై ప్రదర్శన చేసినందుకు గాను విద్యార్థినులు ముంగండ కీర్తన, గుడాల సంహిత, సైన్స్ గైడ్ టీచర్ కె.సూర్యవాణి టీమ్ కన్సోలేషన్ బహుమతి పదివేలు గెలుచుకున్నందుకు, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో కథల పోటీలలో ప్రథమ బహుమతి పొందిన పంజా బాల శ్రీలక్ష్మి, సామెతలు వ్యాస రచన పోటీలలో ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందిన పుచ్చకాయల వెన్నెలకు వారిని గైడ్ చేసిన ఆర్కేడిబి కుమారిలను ప్రధానోపాధ్యాయు లు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యా కమిటీ చైర్మన్, సభ్యులు అభినందించారు. బహుమతులు గెలుపొందిన విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్ల చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గజేంద్ర గడ్కర్ వి.శేఖర్, యువి.సుబ్బారాజు, వీరవల్లి నాగేశ్వరరావు అంగర వేణు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు మాజీ ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన దమ్మెన్ను మహిళలు

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: రాఖీ పండుగను పురస్కరించుకుని గురువారం మండలంలోని దమ్మెన్ను మహిళలు నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు రక్షాబంధనంగా రాఖీ కట్టారు. నారా లోకేష్ పాదయాత్ర చేపట్టి, 200 రోజులు పూర్తయిన సందర్భంగా ఆయన యాత్రకు సంఘీభావంగా నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు కానూరు గ్రామం నుండి ఉండ్రాజవరం మండలం దమ్మెన్ను వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా దమ్మెన్ను చేరుకున్న శేషారావుకు గ్రామ మహిళలు హారతులిచ్చి, రాఖీ కట్టి తమ అనుబంధాన్ని పంచుకున్నారు. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖి పండుగ మండలంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంట అన్నా చెల్లెళ్ళ, అక్క తమ్ముళ్లతో పండుగ వాతావరణం కనిపించింది. సోదరులు తమ తోబుట్టువుల చేతికి రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో రాఖీ వేడుకలు

విశాలాంధ్ర-దేవరపల్లి: రాఖీ పూర్ణిమ సందర్భంగా గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు క్యాంపు కార్యాలయంలో రాఖీపూర్ణిమ వేడుకలు ఘనంగా జరిగాయి. దేవరపల్లిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ల లక్ష్మి రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, ద్వారకాతిరుమల మండల మహిళా వైసిపి అధ్యక్షురాలు నాగలక్ష్మి చాపల మేరీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారికి స్వీట్లు తినిపించారు. ఎమ్మెల్యే తలారి వారికి రాఖీ శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు

పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన

విశాలాంధ్ర - పిఠాపురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన అధిక ధరలు తగ్గించాలని, ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు పై ప్రచురించిన కరపత్రాల పంపిణీ ప్రచార కార్యక్రమం అనంతరం ఉప్పాడ బస్టాండ్ వద్ద సభ ఏర్పాటు చేశారు. ఈ సభను ఉద్దేశించి సిపిఎం పిఠాపురం మండల సీనియర్ నాయకులు కోనేటి రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ వివిధ ప్రజా సంఘాల నాయకులు, కరణం విశ్వనాథం, భాస్కర్, వీరబాబు, గోపాలకృష్ణ, రమణ అప్పారావు, వనపర్తి సూర్యనారాయణ, ఎస్ సత్తిబాబు సూకరాజు, వి. రాజ, డాక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

విశాలాంధ్ర - పెద్దాపురం : అన్నాచెల్లెళ్ళ అనుబంధాన్ని తెలియజేసే రక్షా బంధన్ (రాఖీ) పర్వదినాన్ని పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో గురువారం ఘనంగా జరుపుకున్నారు. సోదర, సోదరీమణుల ప్రేమను తెలియజేస్తూ కుటుంబ సభ్యులతో చిన్నారులు ఆనందంగా గడిపారు. దూర ప్రాంతాల్లో ఉన్న అన్న కోసం ఎదురుచూసిన వాళ్ళు కొంతమంది, చెల్లెలు కోసం రాకీ కట్టించుకునేందుకు వెళ్ళిన అన్నలతో కుటుంబాల్లో పండుగ వాతావరణం సంతరించుకుంది. చిన్నా,పెద్దా తారతమ్యం లేకుండా నాటి సాంప్రదాయాన్ని గౌరవిస్తూ రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల విద్యార్థులు సోదర భావం తెలియజేస్తు పాఠశాల ప్రిన్సిపాల్ రాయవరపు సత్య విద్యార్థులచే రాఖీ కట్టించారు.

ఘనంగా కాపు రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు నల్ల సూర్యచంద్రరావు వర్ధంతి

విశాలాంధ్ర - పి గన్నవరం : పి గన్నవరంలోని గోదావరి అక్విడక్టు వద్దనున్న విగ్రహాల పార్కులో కాపు రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు నల్ల సూర్యచంద్రరావు వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక కాపు నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు నల్లా పెద్దకాపు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ తాను పుట్టిన కాపు కులానికి కాకుండా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సేవలందించి పోరాటాలు సాగించిన మహానాయకుడు సూర్యచంద్ర రావు అన్నారు. ప్రభుత్వం అమలాపురంలోని సూర్యచంద్రరావు ఘాట్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం ఆయన విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోండాడ నాగమణి, మండల వైకాపా అధ్యక్షుడు నక్క వెంకటేశ్వరరావు, మాజీ సొసైటీ చైర్మన్ భీమాల సూరిబాబు, ఉప సర్పంచ్ కర్రి బాబురావు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్, మండల అధ్యక్షుడు సాధనాల వెంకట సత్యనారాయణ, దళిత ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు కోట రామ్మోహన రావు, స్థానిక నాయకులు చోల్లంగి సత్తిబాబు, దాసరి కాశి, పుచ్చకాయల నరసింహమూర్తి, కొండ భాస్కరరావు, కోరుకొండ జాన్, నల్లా నరేష్, నల్లా సత్యనారాయణ, పెదకాపు, మడిమెట్ల శేఖర్, నల్లా బ్రదర్స్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ప్రతిభ విద్యాలయంలో స్కూల్ లెడ్ కాన్ఫరెన్స్

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం శ్రీ ప్రతిభ విద్యాలయంలో ఘనంగా గురువారం ఎస్ఎల్‌సి స్కూల్ లెడ్ కాన్ఫరెన్స్ జరిగింది. చిన్నారుల అత్యుత్తమమైన విద్యను అందించడానికి లెడ్ పవర్ రెడ్ స్కూల్ అకాడమీ ఎక్సెన్స్ సిస్టంను అనుసంధానించి కృత్యాధార బోధన ద్వారా నేర్చుకున్న కృత్యములు అన్ని విద్యార్థుల తల్లిదండ్రుల ఎదుట ప్రదర్శించారు. ఈ సందర్భంగా శ్రీ ప్రతిభ విద్యాలయం అధినేత దాసం శేషారావు మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సత్ప్రవర్తనతోనే మంచి విద్యార్థినులు తయారవుతారని, విలువలతో కూడిన విద్యనందిస్తూ వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని ప్రయోజకులుగా తయారు చేయడమే ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. లీడ్ కోఆర్డినేటర్ రాణి మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభ ఆధారంగా సరళమైన రీతిలో ఇంగ్లీష్ భాషను ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ జనరల్ ఎవేర్నెస్ అనే సబ్జెక్టును సింగపూర్ నూతన విధానంలో బోధిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయభూమిపూజ

విశాలాంధ్ర-తణుకు : నియోజకవర్గంలోని తూర్పు విప్పర్రు గ్రామంలో శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి వారి ఆలయ భూమి పూజా కార్యక్రమంలో తణుకు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావు పాల్గొన్నారు. ఆయన వెంట జనసేన పార్టీ తూర్పు విప్పర్రు గ్రామం సర్పంచ్ తమ్మిశెట్టి సత్యనారాయణ,ఉప సర్పంచ్ చిన్న నాగేశ్వరరావు, ఇరగవరం మండలం జనసేన పార్టీ అధ్యక్షులు ఆకేటి కాశి,తూర్పు విప్పర్రు గ్రామం జనసేన పార్టీ అధ్యక్షులు కటికి రెడ్డి శ్రీనివాస్,జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఫాస్ట్రాక్ నూతన ప్రచార కర్తగా నటుడు విజయ్ దేవరకొండ

విశాలాంధ్ర-రాజమండ్రి: భారతదేశపు ప్రతిష్టాత్మకమైన వాచ్ యాక్సెసరీస్ బ్రాండ్ ఫాస్ట్రాక్ తమ కొత్త బ్రాండ్ ప్రచారం 'బీ బోల్'తో ముందుకు రానున్నట్టుఫాస్ట్రాక్ కోఆర్డినేటర్ చెప్పారు. ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండ ఇప్పుడు ఫాస్ట్రాక్ బ్రాండ్ అంబాసిడర్‌గా కనిపించనున్నారన్నారు. సూక్ష్మ నాటకీయత, పూర్తి ఉల్లాసం, సొగసరి మరియు అనుచితమైన ప్రత్యేక ఫ్యాషన్ వైరుధ్యాల శ్రేణితో కూడిన యువత జీవితాల్లో విభిన్న వాస్తవాల కలయికను ప్రచారం హైలైట్ చేస్తుందన్నారు. ఈ బ్రాండ్ తమ వినియోగదారులను నిస్సంకోచంగా "బీ బోల్" అని ప్రేరేపించడం వారి వైరుధ్యాలను ఉల్లాసంగా ప్రదర్శించడం లక్ష్యంగా పెట్టుకుందని, ఈ ప్రచారం 15 విశిష్టమైన వాచీల కలెక్షన్‌ను హైలైట్ చేస్తుందని తెలిపారు.

ఉప్పాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న కన్నబాబు

విశాలాంధ్ర - కరప : శ్రావణ పౌర్ణమి సందర్భంగా కరప ఉప్పాలమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన కుంకుమ పూజ కార్యక్రమంలో కాకినాడ రూరల్ శాసన సభ్యులు మాజీ మంత్రి కురసాల కన్నబాబు పాల్గొని ఉప్పాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎంపీపీ పెంకె శ్రీలక్ష్మి సత్తిబాబు, గ్రామ సర్పంచ్ సాగే ఆశాజ్యోతి కుమార్ ఎమ్మెల్యే కన్నబాబుకు రాఖీలు కట్టి అన్నా చెల్లెలు అనుబంధాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రాఖీ పండుగ సోదరి భావాన్ని, సహోదర ప్రేమను, మనుషుల మధ్య ప్రేమానురాగాలను గుర్తు చేస్తుందని తెలిపారు. 200 మంది మహిళలు కలశాలుతో ఏర్పాటు చేసిన పూజలో కన్నబాబు దంపతులు పాల్గొని తరించారు. అనంతరం గుడి వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వై సుబ్బారావు వైస్ ఎంపీపీ భీమేశ్వరరావు, గొర్రెల వెంకన్న, ముద్రగడ వీరబాబు, నక్క వీరభద్రరావు నక్క సత్తిబాబు, నక్క చిన్న తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ కన్నబాబు జిల్లా అధ్యక్షుడిగా మూడోసారి హ్యాట్రిక్

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ముచ్చటగా మూడోసారి జిల్లా అధ్యక్షుడిగా రావడం ఎంతో ఆనందమని ప్రముఖ న్యాయవాది వైసిపి స్టేట్ యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పులగం రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. కాకినాడ రూరల్ మండలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ప్రెస్ క్లబ్ ఆఫ్ కోకనాడ రూరల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కన్నబాబుకు క్లబ్బు లీగల్ అడ్వైజర్ రామకృష్ణారెడ్డి మరియు క్లబ్ సభ్యులు దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా పులగం రామ కృష్ణారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టు స్థాయి నుంచి ఎమ్మెల్యే, మంత్రిగా అంచె లంచెలుగా ఎదిగారని తెలిపారు. 2016లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్షుడిగా రావడం, 2019 ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయడంలో ముఖ్య పాత్ర వహించారని అన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో కూడా పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్యేగా కురసాల కన్నబాబు అత్యంత మెజార్టీతో గెలుపొందుతారని జోస్యం చెప్పారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ఆఫ్ కోకనాడ రూరల్ అధ్యక్షులు బిందాన సురేష్,మాజీ అధ్యక్షులు బివి భాస్కర్, చిన్న పత్రికల సంక్షేమ సంఘం ప్రతినిధి రాయవరపు ప్రభాకర్, క్లబ్బు అధ్యక్షులు వీవీఎస్ ప్రకాశరావు, కార్యదర్శి వీర సరేంద్ర కుమార్, సీనియర్ పాత్రికేయులు పిచ్చుక రఘు, గుబ్బల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

"వికాస" లో2న ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - కాకినాడ : "వికాస" కార్యాలయంలో సెప్టెంబర్ 02వ తేదీ శనివారం "ఎంఎన్‌సి టైర్ మ్యానిఫ్యాక్చరింగ్" కంపెనీలో టెక్నిషియన్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగానికి డిప్లొమో ఆల్ ట్రేడ్స్ (సివిల్ తప్పా) ఉత్తీర్ణులైన 24 సం.ల్లోపు పురుష అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ. 14,610/- జీతం + భోజనం, రవాణా సౌకర్యం ఉంటుంది. ఈ ఉద్యోగానికి ఎంపికైన వారు నెల్లూరు (శ్రీసిటీ)లో పనిచేయాల్సి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ సెప్టెంబర్ 02వ తేదీ శనివారం "వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ" వద్ద ఉదయం 9 గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్సులతో హాజరుకావలెను. మరిన్ని వివరాలకు సెల్ : 7799376333 సంప్రదించవలెను.

దేశ ఆర్థిక వ్యవస్థలో బ్యాంకింగ్ పాత్ర కీలకం

విశాలాంధ్ర-మచిలీపట్నం : ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే బ్యాంకింగ్ వ్యవస్థ అత్యంత ముఖ్యమని,దేశ ఆర్థిక వ్యవస్థలో బ్యాంకింగ్ పాత్ర ఎంతో కీలకమని కృష్ణాజిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక కృష్ణా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఆధునికీకరించిన విశ్వవిద్యాలయ శాఖను కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు విశ్వవిద్యాలయ విద్యార్థిని విద్యార్థులు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, భారతదేశ జనాభాలో 60 శాతం మంది 35 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు గలవారని, వారి మేధోశక్తికి

తగిన ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయ క్యాంపస్ లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్తి స్థాయి బ్యాంకు శాఖగా రూపుదిద్దుకోవడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. గతంతో సరిపోల్చితే, జిల్లాల పునర్విభజన అనంతరం కృష్ణాజిల్లా గణనీయంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని, వందల ఏళ్ల చరిత్ర ఉన్న మచిలీపట్నం పోర్టు పనులను వేల కోట్ల రూపాయలను కేటాయించి ఇటీవల ముఖ్యమంత్రి ప్రారంభించడం ఎంతో విప్లవాత్మకమైన పరిణామమని అన్నారు, అలాగే సెప్టెంబర్ మొదటి వారం నుంచి మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కావడం ఎంతో శుభ సూచికమన్నారు. కృష్ణా విశ్వ విద్యాలయంలో ఉద్యోగ ఉపాధి ఆధారిత కోర్సులను ప్రారంభించాలని కలెక్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కు సూచించారు. మచిలీపట్నం పోర్టు ద్వారా పలువురికి ఉపాధి లభిస్తుందని పోర్ట్ ట్రాన్స్ పోర్ట్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్, ఆక్వా, మెరైన్ ఎక్స్ పోర్ట్ డెవలప్మెంట్ మేనేజ్మెంట్ తదితర కోర్సులను కృష్ణా విశ్వ విద్యాలయంలో ప్రవేశపెడితే మిగతా యూనివర్సిటీల కన్నా భిన్నంగా ఉంటుందని పలువురు విద్యార్థులు ఆయా కోర్సులను అధ్యయనం చేసేందుకు ఆసక్తి చూపుతారని కలెక్టర్ అన్నారు. మచిలీపట్నం నుంచి యూనివర్సిటీకి వచ్చే రహదారులకు మహర్దశ పట్టనుందని, ఆయా రోడ్ల నిర్మాణం ప్రస్తుతం టెండర్ ప్రక్రియ దశలో ఉన్నాయని త్వరలో యూనివర్సిటీకి మెరుగైన రహదారి సౌకర్యం ఏర్పడనున్నట్లు విద్యార్థిని విద్యార్థుల హర్షధ్వానాల మధ్య కలెక్టర్ పి. రాజాబాబు ప్రకటించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధునికమైన బ్యాంకు సేవలను కృష్ణా విశ్వవిద్యాలయంకు చెందిన విద్యార్థిని విద్యార్థులు ఉద్యోగులతో పాటు పరిసరాల్లోని, ఆక్వా రైతులు, ప్రజలు కూడా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి. జ్ఞానమణి, రిజిస్టర్ ప్రొఫెసర్ ఎం.రామిరెడ్డి, రెక్టర్ ప్రొఫెసర్ డి సూర్యచంద్రరావు, మచిలీపట్నం తహసిల్దార్ శ్రీవిద్య, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ విజయవాడ మనీష్ కుమార్ సింగ్, రీజనల్ మేనేజర్ ఫణి రామ్ కుమార్, చీఫ్ మేనేజర్ మచిలీపట్నం మెయిన్ బ్రాంచ్ కె.రామారావు, చీఫ్ మేనేజర్ క్రెడిట్,ఎస్ పిఏ టి. ఏసు పాదం, చీఫ్ మేనేజర్ (ఆపరేషన్స్) మురలీధర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.